# సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 8 | ఏప్రిల్ | 2025






**ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్**

కేయూ పరిధిలోని కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. - 8లో▸




**రక్తనిధి.. హతవిధీ!** - 8లో▸

ఎంజీఎం రక్తనిధి కేంద్రంలో కనీస వసతులు కరువయ్యాయి. బెడ్లు చిరిగిపోయాయి. రక్తదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గరిష్టం/కనిష్టం
$37^0 / 22^0$

**వాతావరణం**

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 'పోషణ పక్షం' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ




**హన్మకొండ అర్బన్:** జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'పోషణ పక్షం-25 ' కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య అధికారులతో కలిసి ఆవిష్కరించారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా జిల్లాలో నేటి(మంగళవారం) నుంచి 22వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వైవీ.గణేశ్, డీఆర్డీఓ మేన శ్రీను, డీడబ్ల్యూఓ జయంతి, ఆర్డీఓలు రాథోడ్ రమేశ్, నారాయణ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**విద్యారణ్యపురి:** రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ శిక్షణ కోర్సులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ డి.వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి 29 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఈనెల 17 నాటికి 18 ఏళ్ల నుంచి 45 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. సంబంధిత టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సుల్లో లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఆయా దరఖాస్తులు డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులకు మే 1 నుంచి జూన్ 11 వరకు 42 రోజుల శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.తెలంగాణ.గౌట్.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

### రేపు జెడ్పీలో పాత వాహనాల వేలం

సాక్షి ఎఫెక్ట్

**హన్మకొండ:** జిల్లా ప్రజాపరిషత్‌లో తుప్పు పట్టిపోతున్న పాత వాహనాల్ని వేలం వేయాలని అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. 'సాక్షి'లో ఫిబ్రవరి 25న ప్రచురితమైన 'మట్టిలో కలవాల్సిందేనా' ఫొటో ఫీచర్‌కు జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. తుప్పు పడుతున్న 10 పాత వాహనాలను వేలం వేయాలని నిర్ణయించింది. ఈనెల 9న ఉదయం 11 గంటలకు హనుమకొండ జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో వేలం నిర్వహించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని హనుమకొండ జెడ్పీ సీఈఓ ఎం. విద్యాలత కోరారు.

### శిక్షణ సంస్థలనుంచి దరఖాస్తుల ఆహ్వానం

**న్యూశాయంపేట:** నిరుద్యోగ క్రిస్టియన్ మైనార్టీ యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా మైనార్టీల సంక్షేమాధికారి టి.రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌డీసీ, టాస్క్, ఈజీఎంఎం, మెప్మా, ఎంఎస్ఎంఈ, అనుసంధానం కలిగిన అర్హత ఉన్న శిక్షణా సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సంస్థలు పూర్తి వివరాలతో హనుమకొండ సుబేదారిలోని షరీఫన్ మసీదు ఎదురుగా ఉన్న కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 12లోగా గడువు ఉందని పేర్కొన్నారు.

### మావోయిస్టులు అజ్ఞాతం వీడాలి



**వరంగల్ క్రైం:** మావోయిస్టులు అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవితం గడపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 21న వరంగల్ పోలీస్ కమిషనర్ ఎదుట లొంగిపోయిన నిషేధిత మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యురాలు వంజం కేశే అలియాస్ జెస్సీకి ప్రభుత్వం ప్రకటించిన రూ.4 లక్షల రివార్డును సోమవారం సీపీ సన్ ప్రీత్ సింగ్ అందజేశారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీలు జితేందర్ రెడ్డి, తిరుమల్, ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

### కౌన్సెలింగ్ పూర్తి

**ఎంజీఎం:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న మిడ్ లెవెల్ హెల్త్ కేర్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టులకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు హనుమకొండ డీఎంహెచ్ఓ అప్పయ్య తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌కు 11 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్‌కు సంబంధించి ఒక్క అభ్యర్థీ హాజరు కాలేదని, అలాగే దివ్యాంగుల కోటాకు సంబంధించి అర్హులైన అభ్యర్థులు లేనందుకు ఖాళీగా ఉంచినట్లు పేర్కొన్నారు.

# ఒకరి మెప్పు.. ప్రజలకు ముప్పు

## 7, 10 డివిజన్ల పరిధిలో ఇష్టారాజ్యంగా స్మార్ట్ సిటీ పనులు

- వేసిన రోడ్డును తవ్వి కల్వర్టు నిర్మాణం
- ఓ కాంప్లెక్స్ యజమాని కోసమేనంటూ ఆరోపణలు
- అశాస్త్రీయ పనులతో పొంచి ఉన్న ముంపు
- కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం

**హన్మకొండ చౌరస్తా:** హనుమకొండలోని బస్టాండ్ మూలమలుపు హనుమాన్ టెంపుల్ నుంచి అలంకార్ వరకు చేపట్టిన స్మార్ట్‌సిటీ పనులపై పర్యవేక్షణ కొరవడడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరవాసులకు ప్రయోజనకరంగా ఉండాల్సిన అభివృద్ధి పనులను కొందరు ప్రైవేట్ వ్యక్తుల మెప్పు కోసం నిర్మాణాల్లో మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఎప్పటికప్పుడు నిఘా పెట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**రూ.కోటి పనుల్లో ఇష్టారాజ్యం**

స్మార్ట్‌సిటీ పథకం ద్వారా రూ.కోటి నిధులతో 7, 10 డివిజన్ల పరిధి హనుమకొండ కొత్తబస్టాండ్‌కు వెళ్లే దారిలో మూలమలుపు నుంచి అలంకార్ వరకు దాదాపు 60 ఫీట్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. నెల రోజుల క్రితం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఈ పనులను లాంఛనంగా ప్రారంభించారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇంజనీరింగ్ విభాగం ప్రతిపాదించిన విధంగా కాకుండా ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాల కోసం చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

**డ్రెయినేజీ దారి మళ్లింపు..**

బస్టాండ్ మూలమలుపులో పనులు ప్రారంభమైన మారెమ్మ చెట్టు వద్ద ఓ ప్రైవేట్ వ్యక్తి బడా షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నాడు. ఏడాది క్రితం ప్రారంభించిన కాంప్లెక్స్ నిర్మాణం ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. కాంప్లెక్స్ ప్రధాన గేటు ముందునుంచి డ్రెయినేజీ ఉండగా ప్రస్తుతం దాన్ని పూర్తిగా మూసివేశారు. అందుకోసం వేసిన సీసీ రోడ్డును రెండు రోజులకే తవ్వి కొత్తగా డ్రెయినేజీ కోసం కల్వర్టును నిర్మించారు. మచిలీబజార్ నుంచి మారెమ్మ చెట్టు ముందు భాగం, పింజర్ల వీధి మీదుగా చౌరస్తా పెద్ద నాలాలో కలవాల్సిన నీరు, ఇప్పుడు వంకర్లు తిరుగుతూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.



రోడ్డు వేసిన రెండు రోజులకే తవ్విన కాంట్రాక్టర్



నీరు వెళ్లేందుకు ఇరుకుగా నిర్మించిన కల్వర్టు



రోడ్డుకు అడ్డుగా ఉందని నరికేసిన భారీ వృక్షం

**పొంచి ఉన్న ముంపు**

కాంట్రాక్టర్ చేపట్టిన అశాస్త్రీయ పనులతో వర్షాకాలంలో వరద ముంపు పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీని అడ్డంగా నిర్మించడం వల్ల మచిలీబజార్, రాజ్‌పుత్ వాడ, అగ్గలయ్య గుట్ట నుంచి వచ్చే వరద నీరు సాఫీగా వెళ్లకుండా మారెమ్మ చెట్టు వద్ద నిలిచిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

**డ్రెయినేజీ పనులు కూడా చేపడతాం**

బస్టాండ్ క్రాస్ నుంచి అలంకార్ వరకు సుమారు రూ.కోటితో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు 90శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు వారం రోజుల్లో పూర్తికానున్నాయి. త్వరలో డ్రెయినేజీ పనులు కూడా చేపడుతాం. కల్వర్టు నిర్మాణం వల్ల రెండు వైపులనుంచి వరద, డ్రెయినేజీ నీరు వెళ్లేందుకు వెసులుబాటు ఉంటుంది.

\- హరి, ఏఈ, జీడబ్ల్యూఎంసీ

**రోడ్డు వేసిన మరుసటి రోజే తవ్వారు**



దశాబ్దాలుగా మారెమ్మ చెట్టు నుంచి అలంకార్ వరకు అధ్వానంగా ఉన్న రోడ్డును ఇప్పుడు వేస్తుండడం సంతోషంగా ఉంది. కానీ, రోడ్డును నిర్మించిన కాంట్రాక్టర్ రాత్రికి రాత్రే తవ్వి డ్రెయినేజీని దారి మళ్లించి తిరిగి కల్వర్టు నిర్మించాడు. ఇదేంటని మా కాలనీ వారందరం పరిశీలిస్తే పక్కనే నిర్మిస్తున్న బడాషాపింగ్ కాంప్లెక్స్ ఎదుట డ్రెయినేజీ లేకుండా చేయడం కోసమని తెలిసింది. అశాస్త్రీయ డ్రెయినేజీ నిర్మాణంతో మా కాలనీలకు వరద ముంపును తెచ్చినట్లే. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరదనీరు సాఫీగా వెళ్లేలా డ్రెయినేజీ నేరుగా నిర్మించాలి.

\- నరసింహస్వామి, రాజ్‌పుత్‌కాలనీ

**ప్రమాద సూచికలు లేక పడిపోయా..**



నెల రోజులుగా చేస్తున్న సీసీ రోడ్డు పనుల వద్ద కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రాత్రివేళ అటుగా వెళ్తూ ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయాను. వందల సంవత్సరాల చెట్టును నరికివేశారు. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం.

\- రమేశ్ మీనా, మచిలీబజార్

# వినతులు వెంటనే పరిష్కరించండి





వినతులు స్వీకరిస్తున్న హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

**హన్మకొండ అర్బన్:** ప్రజావాణిలో వివిధ రకాల సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన వినతులను ఆయా శాఖల అధికారులు జాప్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రజలు అందించిన వినతులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజావాణిలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ 12, తహసీల్దార్ హసన్‌పర్తి 7, డబుల్ బెడ్‌రూం నోడల్ ఆఫీసర్ 6, ఆర్డీఓ హనుమకొండ 6తో పాటు వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 106 దరఖాస్తులు స్వీ కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వైవీ.గణేశ్, డీఆర్డీ ఓ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేశ్, డాక్టర్ నారాయణ, జిల్లా అధికారులు, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

**హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి..**

వేసవి నేపథ్యంలో జిల్లాలోని చెరువులు, కుంటలు, బావులు, జలాశయాల వద్ద ఈతకు వెళ్లి మృత్యువాత పడకుండా రక్షణ చర్యల్లో భాగంగా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వీలైతే జలాశయాల చుట్టూ రక్షిత కంచె ఏర్పాటుతో పాటు గ్రామాల్లో చిన్న పిల్లలు, పెద్దలు సంరక్షకులు లేకుండా బావులు, జలాశయాల్లోకి ఈతకు వెళ్లవద్దని డప్పు చాటింపు చేసి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, కార్యవర్గ సభ్యులు కొండబత్తిని రాజేందర్, సీతారామారావు, తాడూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**క్షేత్రస్థాయిలో ఫిర్యాదులను పరిశీలించండి: వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద**

**వరంగల్:** ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణితో కలిసి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను పరిష్కరిస్తే బాధితులు పదే పదే ప్రజావాణికి వచ్చే అవకాశం ఉండదన్నారు. గ్రీవెన్స్‌లో మొత్తం 93 వినతులు రాగా ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు.

**శ్మశానవాటికకు హద్దులు నిర్ణయించాలి..**

వరంగల్ దేశాయిపేట గ్రామశివారులోని సర్వే నంబర్ 308లోని ప్రభుత్వ భూమిలో ది పెంతెకొస్తు మిషన్ చర్చి క్రైస్తవులకు సంబంధించిన (సమాధుల స్థలం) శ్మశానవాటికకు హద్దులు పెట్టాలి. 1.35 ఎకరాలు ఉన్న భూమి ప్రస్తుతం 17 గుంటలు మాత్రమే మిగిలింది. స్థలాన్ని ఆక్రమించేందుకు పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. హద్దులు పెట్టాలని రెండేళ్ల క్రితం ల్యాండ్ సర్వే అధికారులకు ఆదేశాలు జారీ అయినా ఇప్పటి వరకు హద్దులు ఏర్పాటు చేయలేదు.

## పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

**హన్మకొండ అర్బన్:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పనులపై సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య పాల్గొని పలు అంశాలపై అధికారులతో మాట్లాడారు. భద్రకాళి మాడవీధుల పనులు, చెరువు పూడికతీత, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక , రోడ్ల విస్తరణ తదితర అంశాలపై మాట్లాడారు. పెండింగ్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో హనుమకొండ కలెక్టర్, ఎమ్మెల్యే నాయిని, మేయర్, ఇతర అధికారులు

## 'ఎండాకాలం' అప్రమత్తంగా ఉండాలి

అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

**హన్మకొండ అర్బన్:** వేసవి దృష్ట్యా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వేసవికాలానికి సంబంధించిన ఆయా శాఖలు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేసేలా బ్యానర్ల ఏర్పాటు, కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు పాఠశాలలు, పని ప్రదేశాల వద్ద అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. నగరంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ తరగతి గది వద్ద నీటి కుండను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులకు తెలియజేశారు. వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ చర్యలు తీసుకోవాలన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి 87126 99150, హనుమకొండ ఫైర్ స్టేషన్ 87126 99304, పరకాల ఫైర్ స్టేషన్ 87126 99306 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

## ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

11న పోలింగ్.. అనంతరం ఫలితాలు



**వరంగల్ లీగల్:** వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాలు 2025-26 ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ సోమవారం ముగిసింది. ఈమేరకు బరిలో ఉన్న అభ్యర్థులు ఈనెల 11న జరిగే ఎన్నికల్లో తలబడనున్నారు. కాగా.. నామినేషన్ల స్వీకరణ రోజునే కొన్ని పోస్టులు ఏకగ్రీవం కాగా నామినేషన్ల ఉపసంహరణతో మరికొన్ని కూడా ఏకగ్రీవమయ్యాయి.

**బరిలో ఉన్న అభ్యర్థులు వీరే...**

వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానా నికి ఈ.ఆనంద్‌మోహన్, వి.కోటేశ్వర్ రావు, వి.సుధీర్, ప్రధాన కార్యదర్శి స్థానానికి బి.అనిల్‌కుమార్, ఆర్.నాగేంద్రచారి, పి.ప్రవీణ్ కుమార్, డి.రమాకాంత్, జి.శివ బరిలో నిలిచినట్లు ఎన్నికల అధికారులు సీహెచ్ చిదంబర్‌నాథ్, టి.శ్రీధర్ తెలిపారు. జాయింట్ సెక్రటరీ స్థానానికి ఎ.కమలాకర్, ఎం.శ్రీధర్, వి.విష్ణుప్రసాద్, జాయింట్ సెక్రటరీ (మహిళా) కె.గోపికారాణి, ఆర్.శశిరేఖ, జాయింట్ సెక్రటరీ (స్పోర్ట్స్/కల్చరల్) ఎస్.శివప్రసాద్, జి.వెంకటరమణ, కోశాధికారి ఎస్.అరుణ, ఆర్.ప్రభాకర్, జాయింట్ సెక్రెటరీ స్పోర్ట్స్/కల్చరల్‌కు సి.మల్లేశ్, వి.రమేశ్, ఎ.సందీప్‌కుమార్, జాయింట్ సెక్రటరీ లైబ్రరీ మహ్మద్ అజార్ పాషా, కోశాధికారి నాగభూషణం, పి.ప్రవీణ్‌కుమార్, సీహెచ్ సాంబశివ రావు బరిలో నిలిచినట్లు పేర్కొన్నారు.

**హనుమకొండలో..**

హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి టి.కృష్ణమూర్తి, ఎ.మార్కండేయ, టి.నరేందర్, ఎం.రంజిత్, పి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి స్థానానికి వి.నరేందర్, పి.నవీన్‌కుమార్, కె.రవి, బి.శంకర్ బరిలో నిలిచినట్లు ప్రధాన ఎన్నికల అధికారి కె.రమేశ్‌బాబు తెలిపారు. ఉపాధ్యక్ష స్థానానికి ఎస్.రాజన్‌బాబు, సీహెచ్ రమేశ్, కార్యవర్గ సభ్యులుగా పి.కమలాకర్, సీహెచ్ నిఖిల్‌కుమార్, కె.ప్రదీప్, ఆర్.ప్రవీణ్‌కుమార్, బి.శివకుమార్ యాదవ్, బి.సునీల్‌కుమార్ బరిలో నిలిచారు. కాగా.. జాయింట్ సెక్రటరీగా ఎంకే భీంరావ్‌జీ అంబేద్కర్, జాయింట్ సెక్రటరీ (మహిళా) ఆర్.నాగేంద్ర, 30 సంవత్సరాల సీనియర్ కార్యవర్గ సభ్యుడిగా కె.రాజేశ్వర్, 20 సంవత్సరాల సీనియర్ కార్యవర్గ సభ్యుడిగా కె.ఆశీర్వాదం, సీనియర్ మహిళా కార్యవర్గ సభ్యురాలిగా ఇందిరా వేదకుమారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. 11వ తేదీ (శుక్రవారం) ఎన్నికల అనంతరం ఫలితాలు వెలువరించనున్నట్లు ఎన్నికల అధికారుల పేర్కొన్నారు.

# మౌలిక వసతుల సంగతేంటి?

- గ్రేటర్ గ్రీవెన్స్‌లో కమిషనర్‌ను ప్రశ్నించిన నగరవాసులు
- నగానికిపైగా ఆక్రమణలు, అతిక్రమణలపై ఫిర్యాదులు
- వెల్లువెత్తిన ఫిర్యాదులు

**వరంగల్ అర్బన్:** 'కాలనీల్లో చాలా సమస్యలున్నాయి. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. దోమలు విజృంభిస్తున్నాయి. అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. భవన నిర్మాణాల అతిక్రమణలు, అనధికారిక కట్టడాలు, డ్రెయినేజీలు, సీసీ రోడ్లు తదితర మౌలిక వసతుల సంగతేంటి' అని సోమవారం బల్దియా కార్యాలయంలో నిర్వహించిన గ్రేటర్ గ్రీవెన్స్‌లో ప్రజలు కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను ప్రశ్నించారు. మహా నగరంలోని పలు కాలనీల ప్రజలు సమస్యలపై గ్రేటర్ గ్రీవెన్స్‌లో గళమెత్తారు. గతంలో ఎన్నడూ రాని విధంగా పెద్ద ఎత్తున ఫిర్యాదులు నమోదయ్యాయి. ప్రజలు బారులుదీరడంతో కార్యాలయం ఆవరణంతా కిటకిటలాడింది. పలుమార్లు వినతులు ఇచ్చినా ఇంత వరకు సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదని వాపోయారు. ట్రైసిటీతోపాటు శివారు ప్రాంతాల ప్రజల నుంచి ఫిర్యాదులు అధికంగా వచ్చాయి. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో గ్రీవెన్ సెల్‌కు 120 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో టౌన్ ప్లానింగ్‌కు అత్యధికంగా 60 వినతులు అందాయి. అంటే ఆ విభాగాధికారుల పనితీరు ఎలా ఉందో స్పష్టమవుతోంది. మౌలిక వసతుల కోసం ఇంజినీరింగ్ సెక్షన్‌కు 32, ప్రజారోగానికి 3, పన్నుల విధింపులో తేడాలు, ఫిర్యాదులపై 17, తాగునీటి సరఫరా కోసం 6 వినతులు అందినట్లు బల్దియా అధికారులు వెల్లడించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్ఓలు రమేశ్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

**ఫిర్యాదుల్లో కొన్ని..**

- హనుమకొండ రాజాజీనగర్ నుంచి డబ్బాల వరకు చేపట్టిన సీసీ రోడ్డు పనుల్లో ఆక్రమాల తొలగింపులో అవకతవకలు జరిగాయని చర్యలు తీసుకోవాలని కాలనీ సొసైటీ ప్రతినిధులు కోరారు.
- వరంగల్ విశ్వకర్మ వీధిలో 9-10-168 రోడ్డుపై ర్యాంపు నిర్మిస్తున్నారని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.
- గిర్మాజీపేట 8-7-67 రోడ్డు సెట్ బ్యాక్ లేకుండా ఇళ్లు నిర్మిస్తున్నారని చర్యలు తీసుకోవాలని విన్నవించారు.
- హంటర్ రోడ్డు గాయత్రి దేవాలయం వద్ద భద్రకాళి ట్యాంక్ బండ్‌కు వెళ్లే రోడ్డుపై ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని కాలనీలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని కాలనీవాసులు మూడుసార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.
- హనుమకొండ అలంకార్ జంక్షన్‌లో సర్ అలామా ఇక్బాల్ స్మారకార్థం విగ్రహం నిర్మించాలని బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు నయీమొద్దీన్ కోరారు.
- హంటర్ రోడ్డు దుర్గా కాలనీ త్రివీ స్కూల్ ఎదురుగా పార్కు స్థలాన్ని 14 ప్లాట్లు చేసి విక్రయించారని చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విన్నవించారు.
- మడికొండ వెస్ట్ సిటీ చిల్డ్రన్స్ పార్కులో ఓపెన్ జిమ్, ఇతర పరికరాలు ఏర్పాటు చేయాలని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరారు.
- వరంగల్ 35వ డివిజన్ పుప్పాలగుట్టలో అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీలను పూర్తి చేయాలని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.
- హంటర్ రోడ్డు జేఎస్ఎం స్కూల్ నుంచి బ్లూ డైమాండ్ బార్ వరకు డ్రెయినేజీ సదుపాయం లేదని నిర్మించాలని దివాన్ చంద్రకాంత్ విన్నవించారు.
- మడికొండలో ఇళ్ల నడుమ స్క్రాప్ దుకాణాలు, వెల్డింగ్ పనులు చేస్తూ కాలనీవాసులకు అసౌకర్యానికి గురిచేస్తున్నారని చర్యలు తీసుకోవాలని పలుమార్లు కోరినట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు.
- 31వ డివిజన్ న్యూశాయంపేట డాక్టర్స్ కాలనీలో తాగునీటి పైపులైన్లు నిర్మించాలని కాలనీవాసులు కోరారు.
- భీమారం సదానంద కాలనీలో వీధిలైట్లు వెలగడం లేదని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.
- ఉర్సుగుట్టలో నా సొంత స్థలాన్ని ఆక్రమించారని ఫిర్యాదు చేస్తే తన పెంట్ హౌజ్‌ను కూల్చేస్తామని బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ నోటీసు జారీ చేశారని, 16 సార్లు ఫిర్యాదు చేసినట్లు ఎం.సంధ్య ఫిర్యాదు చేశారు.
- న్యూ శాయంపేట 31వ డివిజన్ నుంచి రైల్వే గేట్ భట్టుపల్లి మీదుగా సీసీ రోడ్డు నిర్మించాలని పలు కాలనీల ప్రజలు గ్రీవెన్స్‌లో విన్నవించారు.

## పద్మశాలీల సంక్షేమానికి పెద్దపీట

మేయర్ గుండు సుధారాణి

**హసన్‌పర్తి:** కాంగ్రెస్ సర్కార్ పద్మశాలీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని మేయర్ గుండు సుధారాణి అన్నారు. చింతగట్టు క్యాంప్ సమీపంలో కోటి రూపాయల నిధులతో నిర్మిస్తున్న పద్మశాలీ కమ్యూనిటీ భవనానికి సోమవారం స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి మేయర్ సుధారాణి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి జీవం పోసిందన్నారు. కమ్యూనిటీ హాల్ భవనానికి ప్రభుత్వం కోటి రూపాయలు విడుదల చేసినట్లు చెప్పారు. ఈనిధులతో కమ్యూనిటీ హాల్ భవనాన్ని అధునాతనంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పద్మశాలీల అభ్యున్నతికి కృషి చేస్తూ.. వారి అభివృద్ధికి పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, కార్పొరేటర్ అరుణకుమారి, కమలాపూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్, కార్యదర్శులు వైద్యం రాజగోపాల్, రవీందర్, జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్, కార్యదర్శి గోరంటా రాజు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు గడ్డం భాస్కర్, కేశవమూర్తి, సతీశ్, వేముల సదానందం, దీకొండ భిక్షపతి, మాజీ సర్పంచ్ అనిల్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మేయర్, ఎమ్మెల్యే

## క్లుప్తంగా

### టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం

- 957మంది టీచర్లకు 728 మంది రిపోర్టు
- హాజరుకాని వారిస్థానంలో వేరేవారికి అవకాశం

**విద్యారణ్యపురి:** హనుమకొండ జిల్లా కాజీపేట ఫాతిమా హైస్కూల్‌లోని స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో సోమవారం పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. హ నుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జ నగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలనుంచి 957మంది ఉపాధ్యాయులను సీఈలు, ఏఈలుగా నియమించారు. ఇందులో 728మంది రిపోర్టు చేశారు. తొలిరోజు వివిధ సబ్జెక్టు టీచర్లకు ఒక్కొక్కరికి 15 జవాబుపత్రాలు అందజేసినట్లు సమాచారం. స్పెషల్ అసిస్టెంట్లు ఎస్‌జీటీలు 217మంది వరకు హాజరైనప్పటికీ, సబ్జెక్టు టీచర్లు కొందరు హాజరుకాలేదు. అనారోగ్య కారణాలు చూపుతూ పలువు రు టీచర్లు హాజరుకాలేదని సమాచారం. సబ్జె క్టు టీచర్ల స్థానంలో అక్కడ క్యాంపునకు వచ్చిన ఇతర స్కూల్ అసిస్టెంట్లకు విధులు అప్పగిస్తున్నారు. ఈ ప్రక్రియ ఈనెల 8న కూడా కొనసాగే అవకాశాలున్నాయి. డుమ్మా కొట్టిన టీచర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూ డాల్సిందే. క్యాంపు ఆఫీసర్‌గా హనుమకొండ డీఈఓ డి.వాసంతి వ్యవహరిస్తున్నారు. వాల్యుయేషన్ కేంద్రాన్ని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సందర్శించారు. కేంద్రంలోని సదుపాయాలను పరిశీలించారు. విధుల్లో ఉన్న ఉపాధ్యాయులతోనూ మాట్లాడారు.

### విత్తన సేకరణ ప్రారంభం



**హన్మకొండ అర్బన్:** నగరానికి చెందిన పర్యావరణ పరిరక్షకుడు ప్రకాశ్ సోమవారం విత్తన సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా నగరంలోని రామకృష్ణకాలనీలో విత్తన దాత రాకేశ్ నుంచి విత్తనాలను అందుకున్నారు. అనంతరం ప్రకాశ్ మాట్లాడుతూ.. పట్టణీకరణ నేపథ్యంలో రోజురోజుకూ అడవుల శాతం గణనీయంగా తగ్గుతోందని, దీంతో కాలాల్లో పెను మార్పులు జరిగి ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుందని పేర్కొన్నారు. అడవుల శాతం పెంచడానికి విత్తనాలు సేకరించి రాబోయే వర్షాకాలంలో ఖాళీ ప్రదేశాల్లో చల్లుతామని తెలిపారు. ప్రజలు విత్తనాలు దానం చేయాలనుకుంటే 88011 61695 నంబర్‌కు మెసేజ్, లేదా ఫోన్ కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఖాజా మాసుద్దీన్, తిరుపతి, యుగంధర్, రాకేశ్ పాల్గొన్నారు.

# రక్తనిధి..హతవిధీ!

## ఎంజీఎం రక్తనిధి కేంద్రంలో నిండుకున్న నిల్వలు

- చిరిగిన బెడ్స్.. కనీస వసతులు కరువు
- కీలక విభాగాన్ని పట్టించుకోని అధికారులు
- పనిచేయని బ్లడ్‌బ్యాంక్ ఫోన్ నంబర్
- సేవలు మెరుగుపర్చాలని గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు

**ఎంజీఎం:** ఎంజీఎం ఆస్పత్రికి నిత్యం ప్రాణాపాయ స్థితిలో వచ్చేవారు అనేకం. రోగులకు వైద్య సేవలందించడంలో రక్తనిధి పాత్ర కీలకం. అలాంటి బ్లడ్ బ్యాంక్ నిర్వహణను నిర్వాహకులు, ఎంజీఎం పరిపాలనాధికారులు గాలికి వదిలేశారు. పేదలకు రక్తం అందించేందుకు వచ్చిన దాతలకు కనీస సౌకర్యాలు అందడం లేదు. రక్త నిధి కేంద్రాన్ని పర్యవేక్షించే అధికారులు వివిధ పనులంటూ ఎప్పుడు.. ఎక్కడికి వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. రక్త నిధి కేంద్రంలో ఎన్ని నిల్వలున్నాయి? రిజర్వ్ చేసిన బ్లడ్ ఎంత? సమాచారం తెలుసుకునేందుకు బ్లడ్ బ్యాంక్ నంబర్ సైతం కొన్నేళ్ల నుంచి పనిచేయడం లేదు.



రక్తనిధి కేంద్రం



చిరిగి పక్కకు వంగిన బెడ్

ఈక్రమంలో ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఏకంగా 55సార్లు రక్తదానం చేసిన వ్యక్తి ఎంజీఎం రక్త నిధి కేంద్రానికి సౌకర్యాలు కల్పించాలంటూ సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన రక్త నిధికేంద్ర నిర్వహణ పనితీరుకు నిదర్శనంగా చెప్పొచ్చు.

### చిరిగిన బెడ్స్



చిరిగిన బెడ్

రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చేవారికి అండగా నిలవాలి. కానీ వారికి కనీస అవసరాలను కూడా అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కనీసం రక్తం సేకరించే క్రమంలో దాతలు పడుకునే బెడ్స్‌ను సైతం సమకూర్చలేని దుస్థితి ఎంజీఎంలో నెలకొంది. కాగా.. సమస్యలపై ఆస్పత్రి నిర్వాహకులు, అధికారులను ప్రశ్నిస్తే అన్నింటికీ వారు ఒకే సమాధానం చెబుతున్నారు. 'వ్యవస్థను ఒక్క రోజులో గాడిన పెట్టలేం' అంటూ దాటవేస్తున్నారు. జేబులు నింపుకునే ఫైళ్లపై చూపిస్తున్న ఆసక్తి సేవల మెరుగుదలకు చూపించడం లేదని కొన్ని నెలలుగా తీవ్రస్థాయిలో విమర్శలు వెలువెత్తుతున్నాయి.

### పని చేయని ఫోన్ నంబర్

ఎంజీఎం ఆస్పత్రిలో రక్త నిల్వల కోసం ప్రభుత్వం ఎంజీఎం సూపరిండెంట్ కోసం అధికారికంగా ఎలాగైతే నంబర్ కేటాయించారో.. సేవల్లో కీలకంగా ఉండే రక్త నిధి కేంద్రానికి సైతం 94906 1947 అనే నంబర్‌ను కేటాయించారు. ఈనంబర్‌ను ఉపయోగిస్తే విధులను కచ్చితంగా నిర్వర్తించాల్సి వస్తుందని తెలిసి కొన్నేళ్లుగా ఈ నంబర్‌ను వాడకుండా వదిలివేసినట్లు తెలుస్తోంది.

### నిండుకుంటున్న నిల్వలు..

ఎంజీఎం ఆస్పత్రికి ప్రతీరోజు ప్రాణాపాయ స్థితిలో 10 నుంచి 20 మంది క్షతగాత్రులు వస్తుంటారు. వీరికి అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎక్కిస్తూ చికిత్సలు అందించాల్సి ఉంటుంది. ఇలాంటి రక్త నిధి కేంద్రంలో రోగులు ఎప్పుడు రక్తం కావాలని అడిగినా నిల్వలు నిండుకున్నాయని చెప్పడం పరిపాటిగా మారింది. అసలు ఎంజీఎం ఆస్పత్రిలో రక్తనిధి కేంద్ర సిబ్బంది పనితీరుపై దృష్టి సారించకపోవడంతోనే ఈ కేంద్రం అధ్వానంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం..



నేను ఇప్పటి వరకు 55 సార్లు రక్తదానం చేశా. 2017లో అప్పటి ఆర్‌ఎంఓకు బెడ్స్ గురించి తెలుపగా నామమాత్రంగా మరమ్మతులు చేశారు. ప్రస్తుతం రక్త నిధి కేంద్రానికి దాతలను తీసుకొస్తే చిరిగిపోయిన బెడ్స్ ఉన్నాయని, నిర్వహణ సరిగ్గా లేదని రక్తం ఇచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఎంజీఎం అధికారులకు తెలిపినా స్పందన లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజావాణిలో కలెక్టర్ ఫిర్యాదు చేశాం.

– అయిత ఉషాభాస్కర్

# స్వరూపకు న్యాయం జరిగేదెప్పుడో..?

- 13 ఏళ్లుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- తొమ్మిదేళ్లు సీపీఐఎంఎల్ మావోయిస్టుగా కార్యకలాపాలు
- 2012లోనే లొంగుబాటు, పునరావాసం కింద అందని సహాయం



పాశం స్వరూప

**సాక్షి, వరంగల్:** అడవుల్లో తుపాకీ పట్టి ఆ తరువాత జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టు.. తనకు లొంగుబాటు సమయంలో ప్రకటించిన పునరావాస ఫలాల కోసం అధికారుల చుట్టూ 13 ఏళ్లుగా ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుత సిద్దిపేట జిల్లా చేర్యాల (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా) మండలం కొమురవెల్లి గ్రామానికి చెందిన పాశం స్వరూప అడవిలో దాదాపు తొమ్మిదేళ్లు కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో చివరగా సిరొంచ కమాండర్‌గా పనిచేస్తూ 2012లో పోలీసులకు లొంగిపోయింది. ఆ సమయంలో పునరావాసం కింద 500 గజాల ఇంటిస్థలం, ఐదెకరాల వ్యవసాయ భూమి ఇస్తామని పోలీసు అధికారులు ప్రకటించారు. రెవెన్యూ భూమి కేటాయించి నివేదిక సైతం ఇచ్చారు. కానీ అలాట్‌మెంట్ చేయలేదు. ఆమె కుటుంబపోషణ కోసం కొమురవెల్లి దేవస్థానం ప్రాంగణంలో కట్టెలు, పూలు అమ్ముకుంటూనే, జనజీవన స్రవంతిలో తనకు ప్రభుత్వం పునరావాసం కింద ఇస్తానన్న భూమి కోసం ఇంకా పోరాటం సాగిస్తూనే ఉంది. ఈ క్రమంలో వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌కు వచ్చి మరోసారి కలెక్టర్ సత్యశారదకు తన బాధను ఏకరువు పెట్టుకున్నారు. అప్పటి ఉమ్మడి వరంగల్ కలెక్టరేట్ అధికారులు 2012 జూన్ తొమ్మిదిన ఇచ్చిన ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకొని న్యాయం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆమెను 'సాక్షి'పలకరించగా తన సమస్యను చెప్పుకుంది. 'అప్పటి చేర్యాల తహసీల్దార్ వెంకటేశ్వర్లు కొమురవెల్లి గ్రామంలో సర్వే నంబర్లు 199, 223లో ప్రభుత్వ భూమి ఉందని 500 గజాల స్థలం కేటాయించారు. ఐదెకరాల వ్యవసాయ భూమి విషయంలోనూ నివేదికిచ్చారు. 2012 నుంచి 2016 వరకు అధికారుల చుట్టూ తిరిగా. మధ్యలో కాలి బుల్లెట్ గాయం తిరగదోడడంతో కొన్ని నెలలు విశ్రాంతి తీసుకున్నా. ఇప్పటికే సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లా. అక్కడా పోలీసులను కలిశా. వారు వరంగల్‌కు వెళ్లాలని చెబితే మూడు నెలల నుంచి ఇక్కడి ఐదుసార్లు వచ్చా. మూడుమార్లు పోలీసులను కలిశా. రెండు సార్లు వరంగల్ కలెక్టర్‌ను కలిశా. ఇప్పటికైనా సంబంధిత పత్రాలు నాకు ఇచ్చి భూమి కేటాయించి నా కుటుంబానికి భరోసాను ఇవ్వాలి'అని స్వరూప కన్నీటి పర్యంతమయ్యారు.

# ఆరోగ్యకర జీవనశైలిని పెంపొందించుకోవాలి

- డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సాయికుమార్

**రామన్నపేట :** చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకర జీవనశైలిని పెంపొందించుకోవాలని వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్ సూచించారు. 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం' సందర్భంగా సోమవారం నగరంలోని ప్రభుత్వ బాలుర పరిశీలక గృహంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండేతో కలిసి ప్రారంభించారు. ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ కొంత సమయం వ్యా యామం చేయాలన్నారు. ముఖ్యంగా దూమపానం, మత్తు పదార్థాలు లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.బాలురకు ఆరోగ్యంపై అవగాహనతోపాటు న్యాయ సేవా సంస్థ విధులు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం బాలురకు టూత్ బ్రష్‌లు, పండ్లు అందించారు. జిల్లా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ యశస్విని, డెంటల్ స్పెషలిస్ట్ భరత్, పరిశీలక గృహం సూపరింటెండెంట్ శ్రీదేవి పాల్గొన్నారు.

# బదిలీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్

**హన్మకొండ అర్బన్:** రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయాలని చూడడం సరికాదని, వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని టీఎన్జీఓస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన టీఎన్జీఓస్ నాయకులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. 8 నెలల క్రితమే సాధారణ బదిలీల్లో భాగంగా పెద్ద సంఖ్యలో పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేశారని, తిరిగి ఇప్పుడు మళ్లీ బదిలీలు చేయడం వల్ల కార్యదర్శులు అనేక ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు. గ్రామాల్లో పాలకవర్గం ముగిసి ఏడాది గడిచినా పంచాయతీ ఎన్నికలు కాకపోవడంతో చాలాచోట్ల గ్రామాల అభివృద్ధి పనులకు ఆయా గ్రామాల కార్యదర్శులే పెద్ద మొత్తంలో సొంత డబ్బులు ఖర్చు చేశారని, ఇప్పుడు వేరే ప్రాంతానికి వెళ్తే వారు ఖర్చు పెట్టిన సొమ్ము వారికి అందడం కష్టమవుతుందన్నారు. వారు ఖర్చు చేసిన డబ్బులను వెంటనే ప్రభుత్వం నుంచి ఇప్పించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీలను టీఎన్జీఓస్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేశ్, గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం కార్యదర్శి ఇంజపల్లి నరేశ్, నాయకులు ఎండీ రఫీ, వెంకన్న, సురేశ్, కృష్ణంరాజు, సౌజన్య, అంజలి, వెంకటేశం, ప్రవళిక, లావణ్య, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న నాయకులు

# ఎర్త్ సైన్సెస్ వర్సిటీగా కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీ

### అప్‌గ్రేడ్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- కేయూ నుంచి విడిపోనున్న కళాశాల
- బోధన, బోధనేతర పోస్టులు, ఆస్తుల బదలాయింపు కూడా..
- ఆ నలుగురి అధ్యాపకుల డిప్యుటేషన్లు రద్దయ్యే అవకాశం?

**కేయూ క్యాంపస్ :** కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీని ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఉత్తర్వులు జారీ చేశారు. సహజవనరులు పుష్కలంగా ఉన్న ఈ ప్రాంతంలో వర్సిటీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కూడా వర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీనిని అమలులోకి తీసుకొస్తూ ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ పేరుతో జీఓ జారీ అయ్యింది. ఇందుకు అనుగుణంగా తెలంగాణ యూనివర్సిటీల చట్టం 1991కు సవరణ చేసింది.దీంతో కొత్తగూడెం ప్రాంతవాసులు, విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ జగన్మోహన్‌రాజు

**కేయూ నుంచి బోధన, బోధనేతర, ఆస్తుల బదలాయింపు!**

కొత్తగూడెంలో 1978లో స్కూల్‌ఆఫ్‌మైన్స్ ఓయూ పరిధిలోని పీజీ సెంటర్‌గా ఏర్పాటు అయింది. కాకతీయ యూనివర్సిటీ ఏర్పాటైన అనంతరం 1996 నుంచి కొత్తగూడెం స్కూల్ ఆఫ్‌మైన్స్ కేయూ పరిధిలోకి కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీగా ఆవిర్భవించింది. అప్‌గ్రేడ్ నేపథ్యంలో యూనివర్సిటీ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీలో బోధన, బోధనేతర పోస్టులతో సహా ప్రస్తుతం ఉన్న ఆ కాలేజీ ఆస్తులు కూడా ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి బదలాయింపు జరగబోతుంది. ఇంజనీరింగ్‌కాలేజీలో 41అధ్యాపకుల పోస్టులకుగాను ప్రస్తుతం 16మంది పనిచేస్తున్నారు. పలువురు కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారు.అధ్యాపకుల కొరత ఉంది. 106 నాన్‌టీచింగ్‌పోస్టులు ఉంటే 60 మంది వరకు పనిచేస్తున్నారు. వర్సిటీగా అప్‌గ్రేడ్‌తో పోస్టులు పెరిగే అవకాశాలున్నాయి.

**ఆ నలుగురి డిప్యుటేషన్లు రద్దవుతాయా?**

కాకతీయ యూనిర్సిటీ పరిధిలోని కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీలో గతంలో నియామకమై అక్కడ కొంత కాలం పనిచేసి కేయూలోని ఇంజనీరింగ్ కళాశాలలకు డిప్యుటేషన్‌పై వచ్చిన వారిలో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు భిక్షాలు, వెంకటరమణ, ఇద్దరు అ సిస్టెంట్ ప్రొఫెసర్లు రాధిక, సుమలత ఉన్నా రు. ఇప్పుడు కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ అయిన నేపథ్యంలో వీరి డిప్యుటేషన్లు రద్దవుతాయా అనే అంశం చర్చగా మారింది. ఎందుకంటే వారి పోస్టులు అక్కడే. అందుకే ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి బదలాయింపు జరగనున్న నేపథ్యంలో వీరు అక్కడికి వెళ్లాల్సింటుందనే అంశం యూనివర్సిటీలో చర్చగా ఉంది. లేదా వారికి ఏమైనా ఆప్షన్ ఇస్తారా లేదా వేచి చూడాల్సిందే.

# రైతులకు నేను వ్యతిరేకం కాదు

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

**ధర్మసాగర్:** హనుమకొండ జిల్లాలో ఉన్న ఏకైక అటవీ సంపద దేవునూరు భూములను కాపాడడమే తనలక్ష్యమని, రైతులకు తాను వ్యతిరేకం కాదని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ అధికారులు రైతులకు సంబంధించిన భూములను ఇనుపరాతి గుట్టలు (దేవనూరు) అడవి సరిహద్దు దాటిన తరువాత చూపించాలని, ఇష్టానుసారంగా అడవి మధ్యలో చూపెట్టడం సరికాదన్నారు. రైతుల పేరుతో ఎవరైనా ప్రైవేటు వ్యక్తులు అన్యాయంగా అడవిలోకి చొరబడి అటవీ సంపదను నాశనం చేస్తానంటే చూస్తూ ఊరుకునేది లేదని, ఈ విషయాన్ని ప్రతీ రైతు గమనించాలన్నారు. సర్వే పూర్తయింది కానీ, దాని ఫైనల్ రిపోర్ట్ రాలేదని అధికారులు చెప్పారని వెల్లడించారు. ట్రెంచ్ దాటి లోపలికి వచ్చి చదును చేయడంపై పరిశీలించడానికి వచ్చామని తెలిపారు. కలెక్టర్ కూడా ఇందులో ఇన్‌వాల్వ్ అయ్యారనే విషయం తెలుస్తోందని, ఇప్పటికైనా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి రైతులకు న్యాయం చేస్తూ అటవీ సంపదను కాపాడాలని కోరారు.






# గోదావరి పరీవాహక ప్రాంత అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



వీసీలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

**హన్మకొండ:** వాతావరణ శాఖ ఈదురు గాలులు, భారీ వర్షాలు ఉన్నాయని హెచ్చరించిన నేపథ్యంలో గోదావరి పరీవాహక ప్రాంతాల విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. సోమవారం హనుమకొండలోని టీజీఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్‌ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం పరిధిలో ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా మానిటర్ చేస్తూ ఏదైనా అంతరాయం జరిగితే వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడితే, ట్రిప్పింగ్స్, బ్రేడౌన్‌లు సంభవిస్తే త్వరితగతిన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించారు. పంటల కోతలు జరుగుతున్నందున పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ సర్వీస్‌ల మంజూరు వేగవంతం చేయాలన్నారు. అత్యవసర సమయంలో కావాల్సిన మెటీరియల్‌ను సమకూర్చుతామన్నారు. వ్యవసాయానికి అవసరమైన చోట 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ సర్కిల్‌లో ఎల్‌సీ యాప్‌పై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.సదర్‌లాల్, జీఎంలు, ఎస్‌ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

**హన్మకొండ చౌరస్తా:** అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం నడుస్తోందని, అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. హనుమకొండ 5వ డివిజన్ పరిధిలోని కొత్తూరు బ్రిడ్జి వద్ద రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా అన్ని డివిజన్లలో సైడ్ డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. త్వరలో అర్హులందరికీ రేషన్‌కార్డులు, డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డుల జారీకి ప్రభుత్వం సన్నద్ధం అవుతోందన్నారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్


# సాక్షి క్లాసిఫైడ్స్

**EDUCATION**

■ Study Hall Rs. 1000/- Seat P.M. 1st 30 seats Rs. 500/- this month offer. Registration Time : 10 a.m. to 5 p.m. Inspire Professionals, 2nd Floor, Mayuri Plaza, Kishanpura, HNK - 93916 22073 [M-12940]

**SERVICES**

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. Cont: 7416374863. [WA-7557]

**సీమ పందులను పెంచండి**

■ నామోషీ పడకుండా పందుల ఫామ్ పెట్టండి 12 సం॥ల అనుభవం వారిచే సూచనలు, సలహాలు ఇవ్వబడును. By Back అగ్రిమెంట్ కలదు. S.V. Agrow Consultant, Wgl. 9959426718. [W-1265064]

**WANTED**

■ మా వద్ద సోలార్ ప్యానెల్స్ ఇన్‌స్టాల్ చేయుటకు అనుభవం గల టెక్నీషియన్ అర్జెంటుగా కావలెను. 9849608214, 9032209690. [W-1264100]

■ Hospital Staff, Lab Technicians (Exp), OT - Technicians, Medical Shop Boys (Exp) & Aayammas. Cont: Guardians Hospital, Mulugu "X" Road, Warangal 12 to 2 pm [WA-498]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

■ నమస్తే మార్కెటింగ్ మిత్రులారా! నేను మీ Lotus రియాల్టీ మేనేజింగ్ డైరెక్టర్. Don't Miss This ఆపర్చునిటీ-జనగాం to సూర్యాపేట హైవే దగ్గర 100 ఎకరాల DTCP & RERA అప్రూవ్డ్ MEGA ప్రాజెక్ట్‌లో మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ డైరెక్టర్స్, టీమ్ లీడర్స్ & ఎగ్జిక్యూటివ్స్ (M/F) మిత్రులు కావలెను. Walk-in Today @ హోటల్ హరిత కాకతీయ, నక్కలగుట్ట, హన్మకొండలో ఉదయం 10 గం॥ నుండి సా॥ 6 గం॥ల వరకు అందుబాటులో వుంటాను. రండి కలసి పనిచేద్దాం. మీ Dr. షఫీ షేక్, M.Sc., IT, MA, ✆ 7095 533 533 [B-53]

**ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి**

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


# స్మార్ట్ సిటీ ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి ఆరా

- వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు
- గడువు పొడిగింపు స్పష్టత లేదు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

**వరంగల్ అర్బన్:** కేంద్ర హౌసింగ్–అర్బన్ ఎఫైర్స్ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ గ్రేటర్ వరంగల్‌లో కొనసాగుతున్న స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల పురోగతిపై ఆరా తీశారు. సోమవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తదితరులు పాల్గొన్నారు. వరంగల్ స్మార్ట్‌సిటీ కింద చేపట్టిన ప్రాజెక్టులు, పూర్తయిన పనులు, పురోగతిలో ఉన్న వాటిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. చాలా మేరకు పనులు పూర్తయ్యాయని, మరికొన్ని పనులు పురోగతిలో ఉన్నట్లు కమిషనర్ వెల్లడించారు. పురోగతిలో ఉన్న పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించినట్లు అధికారులు వెల్లడించారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్ గడువు గత నెల 31తో ముగిసింది. కానీ మళ్లీ గడువు పొడిగింపుపై ఎలాంటి ప్రకటన చేయలేదని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, స్మార్ట్ సిటీ పీఎం సి.భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

# చెత్త తరలించే వాహనాల అడ్డగింత



వాహనాలను అడ్డుకుంటున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**మడికొండ:** మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డుతో సుమారు చుట్టుపక్కల ఉన్న పది గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అడ్‌హక్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు డంపింగ్ యార్డ్‌ను అక్కడ నుంచి తొలగించాలని కోరుతూ 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి ఆధ్వర్యంలో డంపింగ్ యార్డుకు వస్తున్న వాహనాలను మడికొండ చౌరస్తాలో సోమవారం అడ్డుకున్నారు. దాంతో ట్రాఫిక్ స్తంభించగా, ఇన్‌స్పెక్టర్ కిషన్.. తన సిబ్బందితో అక్కడకు చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కార్పొరేటర్ రాధికారెడ్డి మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌తో పలు గ్రామాల ప్రజలు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారన్నారు. గడ్డం మహేందర్, పల్లపు యాదగిరి, నర్సింగరావు, బుర్ర రాజ్‌కుమార్, తండా శంకర్, కట్ట వెంకట్రాంనర్సయ్య, ఆవాల నరోత్తంరెడ్డి, బరిగల కృష్ణమూర్తి, బోగి దేవేందర్, గడ్డం అశోక్, అరూరి తిరుపతి, మాచర్ల శ్రీధర్, బత్తి కిరణ్, వెన్నమల్ల రమేశ్, గడ్డం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# సిక్కిం గవర్నర్‌ను కలిసిన మౌంటైనర్ యశ్వంత్



గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న యశ్వంత్

**మరిపెడ రూరల్:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండా గ్రామ పంచాయతీకి చెందిన మౌంటైనర్ భూక్య యశ్వంత్ సోమవారం సిక్కిం గవర్నర్ ఓమ్ ప్రకాశ్ మాథూర్‌ని ఆ రాష్ట్ర రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన వంతు సహకారం, ఆశీస్సులు ఉంటాయని, విజయం వైపు దూసుకెళ్లాలని యశ్వంత్‌కు గవర్నర్ సూచించారు. పట్టుదలతో ప్రపంచంలోనే ఎత్తయిన పర్వతాలను అధిరోహించి భారత దేశ ఖ్యాతి విశ్వవ్యాప్తం చేయాలని యశ్వంత్‌ను గవర్నర్ దీవించారు.

# హనుమకొండ కలెక్టరేట్ పార్కుకు ఉత్తమ అవార్డు



గోల్డెన్ ట్రోఫీ, సర్టిఫికెట్‌ను ప్రదర్శిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

**హన్మకొండ అర్బన్:** హనుమకొండ కలెక్టరేట్‌లోని పార్కుకు రాష్ట్ర ఉద్యానశాఖ ద్వారా నిర్వహించిన 8వ గార్డెన్ ఫెస్టివల్‌లో ఉత్తమ గార్డెన్‌గా అవార్డు లభించినట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి వెంకటేశం తెలిపారు. సంబంధిత గోల్డెన్ ట్రోఫీ, సర్టిఫికెట్‌ను కలెక్టర్ ప్రావీణ్య అధికారుల సమక్షంలో ప్రదర్శించారు. సుమారు 114 రకాల పూలు, నీడనిచ్చే మొక్కలను నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడమేకాకుండా వాటి రక్షణ చర్యలు చేపడుతూ రాష్ట్ర స్థాయి అవార్డు పొందడంపై అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వై.వి గణేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**కరపత్రాల ఆవిష్కరణ..**

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన వేసవిలో జాగ్రత్తలు (ఎండ వేడి తీవ్రత నుంచి ఉపశమనం, ఉపాయాలు), కృత్రిమ రసాయన శీతల పానీయాలు నివారించాలనే కరపత్రాలను సోమవారం కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆచార్య లక్ష్మారెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం, ఉపాధ్యక్షులు రాములు, ఉమామహేశ్వర్ రావు, కోశాధికారి పరికిపండ్ల వేణు, కార్యవర్గ సభ్యులు వకుళాభరణం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# లోకోపైలెట్ల సమస్యలు పరిష్కరించాలి

- రైల్వే మజ్దూర్ యూనియన్ నేతల డిమాండ్



నిరసన తెలుపుతున్న నేతలు

**కాజీపేట రూరల్ :** రైల్వే లోకోపైలెట్ల సమస్యలు పరిష్కరించాలని రైల్వేమజ్దూర్ యూనియన్ లోకో రన్నింగ్ బ్రాంచ్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కాజీపేట రైల్వే క్రూ లాబీ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై రైల్వే బోర్డుతో చర్చలు జరిగాయన్నారు. ఇందుకు రైల్వే బోర్డు మల్టీ డిసిప్లినరీ కమిటీ ఏర్పాటు చేసిందని తెలిపారు. అయితే ఆ కమిటీ ఈ నెల 4వ తేదీ న బోర్డుకు సమర్పించిన నివేదిక రన్నింగ్‌స్టాఫ్‌కు వ్యతిరేకంగా ఉందన్నారు. ఆ రిపోర్టును అమలు చేయొద్దని డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా అన్ని క్రూ లాబీల వద్ద చేస్తున్న నిరసనలో భాగంగా కాజీపేట లాబీ వద్ద కూడా నిరసన చేపట్టామని తెలిపారు. బ్రాంచ్ చైర్మన్ సంగ రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ సాయికుమార్, రమేశ్, ఎన్.కుమారస్వామి, ఎ.కుమారస్వామి, ఎం. ప్రవీణ్, ధనరాజ్, వలీఅహ్మద్, ఎన్.శ్రీనివాస్, వి.ప్రసాద్, భరత్‌లోకోశ్, రమణాచారి, ఆంజనేయులు, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.